# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 147 వ భాగం

## సూర్య వంశం – 15, రామ కథ - 5

రాముడు అరణ్య వాసానికి వెళ్తూంటే తనకి తోచిన దానాలు చేస్తున్నప్పుడు ఒకాయన వచ్చి అడిగాడుట ఏదైనా ఇమ్మని. అడిగినాయన అసలే నీరసంగా, బలహీనంగా ఉన్నాడు. రాముడు సరదాగా 'మీ చేతిలో ఉన్న కర్ర ఎంతదూరం విసిరితే ఆ ప్రాంతంలో ఉన్న గోవులన్నీ మీకు ఇస్తాను' అన్నాట్ట. ఆయన అనేక ఆమడల దూరం విసిరాడు చేతిలో కర్రని పౌరుషం వచ్చి. రాముడు విస్తుపోయి చెప్పాడుట – ఆ ప్రాంతంలో ఉండే గోవులన్నీ ఆయనకి దానం చేస్తూ, 'ఊరికినే సరదాకి అన్నాను మిమ్మల్ని చూసి, ఏమీ అనుకోకండి అలా అన్నందుకు.' రాముడు అలా తన మాట ఎప్పుడూ తప్పలేదు అంటారు. అదే విధంగా రాముడు చేసిన యజ్ఞయాగాదుల, దానాల గురించి శుక మహర్షి చెప్తున్నాడు ఇక్కడ.

సీ. భగవంతుఁడగు రామభద్రుండు ప్రీతితో–
దేవోత్తముని సర్వదేవమయునిఁ
దనుఁదాన కూర్చి యధ్వరములు చేసెను–
హోతకుఁ దూరుపు నుత్తరంబు
సామగాయకునికి శమనదిగ్భాగంబు–
బ్రహ్మకుఁ గ్రమమునఁ బడమ రెల్ల
నధ్వర్యునకు శేష మాచార్యునకు నిచ్చి–
సొమ్ములఁ బంచి భూసురుల కొసఁగి [9-342]

తే. తనదు రెండు పుట్టంబులు దనకు నయిన
మెలఁత మంగళసూత్రంబు మినుకుఁ దక్క
వినతుఁడై యుండె; నా రాము వితరణంబు
పాండవోత్తమ! యేమని పలుకవచ్చు? [9-342.1]

రాముడు విష్ణువు అంశతో పుట్టినవాడే. కానీ ఆ దేవోత్తముడైన విష్ణువు (సర్వ దేవమయుని) గురించి యాగాలు చేశాడు (అధ్వర్యములు). ఆ తర్వాత చేసే దానంలో హోతకి తూర్పు దిక్కు, ఉత్తరం సామగానం చేసినవారికి, యజ్ఞ బ్రహ్మకి (లేదా ఋత్విక్కునికి) దక్షిణం (శమనం), అధ్వర్యులకి పడమర దిక్కు అనీ దానం చేసాడు. మిగిలినిది ఏదైనా ఉంటే అది ఆచార్యుడికి ధారపోసాడు. స్వంత సొమ్ములన్నీ బ్రాహ్మణులకి (భూసురులు) ఇచ్చాక తన, భార్య వంటి మీద రెండు బట్టలూ, సీత మెడలో మంగళసూత్రం తప్ప అన్నీ దానం చేసాడు. 'ఇటువంటి రాముడి గురించి ఇంతకన్నా ఏం చెప్పమంటావు' అంటున్నాడు శుక మహర్షి. ఈ పద్యంలో భార్య అనే పదం ఎక్కడుందో చెప్పగలరా? మెలత – భార్య.

ఈ దానం సంగతి మరోసారి ఆలోచిస్తే 'అరణ్యవాసానికి వెళ్ళాలి నువ్వు రాజ్యం వదులుకుని' అని కైక అంటే 'ఓస్ అంతే కదా' అని రాముడు ఎలా అనుకోగలిగాడు? దానికో విచిత్రమైన సమాధానం చెప్పారు ఒక స్వామి గారు. భగవంతుడే ఈ చరాచర ప్రపంచం విశ్వం అంతా. భగవంతుడే అంతా సృష్టించినప్పుడు అన్నీ తనవే కదా? ఆ స్థితిలో కైక ఏదో ఒక్క అతి చిన్న భూమి అనే గోళం మీద సూక్ష్మాతి సూక్ష్మంగా ఉన్న అయోధ్య అనే రాజ్యం వదులుకో అంటే, నవ్వు వచ్చి, ఓస్ అంతే కదా అన్నాట్ట. ఆత్మానుభూతి కలిగాక ఇదే యోగులకి తెలిసేది; ఈ ప్రపంచం ఏమిటి, నాకూ దీనికీ ఏమిటి సంబంధం, అహం బ్రహ్మాస్మి అని తెలిసాక? ఇదే తత్వం రాముడు చూపించాడు తన మొత్తం జీవితంలో.

ఆ. ధరణి వలదు మాకుఁ దపసుల కేల? నీ
వఖిలలోక గురుఁడవైన హరివి;
మా మనంబు లందు మలయు చీఁకటిఁ బాపు
భవ దుదారరుచులఁ బార్థివేంద్ర! [9-344]

వ. అని పలికి బ్రహ్మణ్యదేవుండైన రామచంద్రుని వినయోక్తులం బూజించి మునులు చని; రిట్లు పెద్దకాలంబు రాజ్యంబుచేసి, రాఘవేంద్రుం డొక్కదినంబున. [9-345]

ఇలా అంతా ఇచ్చేయడం చూసి వాళ్ళు అన్నారు – ఈ భూమి మేము ఏం చేసుకుంటాం? తపస్సు చేసుకునేవారికి ఇదంతా ఎందుకు? ఇదే పైన చెప్పినది – తాపసులకి కావాల్సింది బ్రహ్మం లేదా భగవంతుడు; ఏదో ఒక్క అతి చిన్న భూమి అనే గోళం మీద సూక్ష్మాతి సూక్షంగా ఉన్న అయోధ్య అనే రాజ్యం ఎందుకు? అందువల్ల ఇదంతా నీ దగ్గిరే ఉంచుకుని మాకు మనసులో ఉండే చీకటి తీసివేయి నీ (భవద్), ఉదారమైన కిరణాలతో (రుచుల). అలా ఆయన రాజ్యం చేస్తూ జనం ఏమనుకుంటున్నారో జాగ్రత్తగా గమనిస్తున్నాడు.

సీ. వసుధపైఁ బుట్టెడు వార్త లాకర్ణించు–
కొఱకునై రాముండు గూఢవృత్తి
నడురేయి దిరుగుచో నాగరజనులలో–
నొక్కఁడు దన సతి యొప్పకున్న
"నొరునింటఁ గాపురంబున్న చంచలురాలిఁ–
బాయంగలేక చేపట్ట నేమి
తా వెఱ్ఱి యగు రామధరణీశ్వరుండనే–
బేల! పొ"మ్మను మాట బిట్టు పలుక [9-346]

ఆ. నాలకించి మఱియు నా మాట చారుల
వలన జగములోనఁ గలుగఁ దెలిసి
సీత నిద్రపోవఁ జెప్పక వాల్మీకి
పర్ణశాలఁ బెట్టఁ బనిచె రాత్రి. [9-346.1]

రాత్రిపూట రహశ్యంగా (గూఢవృత్తి) తిరుగుతూ (నడురేయి దిరుగుచో నాగరజనులలో) తనని గురించి రాజ్యంలో ఏమన్నారో విన్నాడు ఓ సారి. అందులో ఒకడు వాళ్ళావిడతో 'రాత్రంతా ఇంకొకరి ఇంట్లో ఉన్న నిన్ను మరోసారి భార్యగా చేపట్టడానికి నేను వెర్రి రాముణ్ణి కాదు, వెళ్ళిపో' అనడం చూశాడు. ఇటువంటివి అంతకుముందు చారులు వినడం కూడా తెలిసింది. నిద్రపోతున్న సీతతో చెప్పకుండా ఆవిణ్ణి వాల్మీకి పర్ణశాలలో విడిచిపెట్టాడు.

వ. అంత; సీతయు గర్భిణి గావునఁ గుశలవు లనియెడి కొడుకులం గనియె; వారికి వాల్మీకి జాతకర్మంబు లొనరించె; లక్ష్మణునకు నంగదుండును, జంద్రకేతుండును భరతునకుఁ దక్షుండును, బుష్కలుండును శత్రుఘ్నునకు సుబాహుండును, శ్రుతసేనుండును సంభవించి; రయ్యెడ. [9-347]

సీత అప్పటికే గర్భిణి అయినందువల్ల అక్కడే పర్ణశాలలో కుశలవులనే వారికి జన్మ ఇచ్చింది. వారికి జాతకకర్మలు వాల్మీకి మహర్షి చేయించాడు. రాముడికి పుట్టినట్టుగానే లక్ష్మణ భరత శతృఘ్నులకి కూడా ఇద్దరేసి కుమారులు పుట్టారు.

క. బంధురబలుఁడగు భరతుఁడు
గంధర్వచయంబుఁ ద్రుంచి కనకాదుల స
ద్బంధుఁ డగు నన్న కిచ్చెను
బంధువులును మాతృజనులుఁ బ్రజలున్ మెచ్చన్. [9-348]

రామాయణంలో చాలామటుకు రామలక్ష్మణుల ధీరత్వం ఉంది కాబట్టి ఇక్కడ భరత శతృఘ్నుల గురించి కూడా చెప్తున్నాడు. భరతుడు గంధర్వుల మీదకి వెళ్ళి జయించి అనేక కానుకలు – బంగారం మొదలైనవాటిని తీసుకొచ్చి, అన్నకి ఇచ్చాడు, తల్లీ, బంధువులూ అందరూ మెచ్చేలాగ.

ఇది కాక రామాయణంలో భరతుడు చేసిన మంచి పని మరొకటి ఉంది. రాముడు రాజ్యం చేస్తూన్నప్పుడు అనేక యాగాలు చేసాడు అని చెప్పారు కదా శుక మహర్షి. అలా చేసేటపుడు రాముడు సభలో అందర్నీ కూర్చోబెట్టి తాను రాజసూయం చేస్తాను అన్నప్పుడు అందరూ సరే అంటే భరతుడు అభ్యంతరం చెప్తాడు. రాజసూయం చేస్తే అనంతంగా జన క్షయం జరుగుతుంది, వద్దు అని (ఇలా జన క్షయం జరగడం మహాభారతంలో కనిపిస్తుంది యుధిష్టిరుడు రాజసూయం చేసాక). అది విన్నాక రాముడు రాజసూయం చేసే ఆలోచన కట్టిపెట్టి అందరి ముందు భరతుణ్ణి మెచ్చుకుంటాడు – చూసారా రాజు ఎలా ఉండాలో ఎంత మంచి సలహా చెప్పాడో అని.

ఆ. మధువనంబులోన మధునందనుం డగు
లవణుఁ జంపి భుజబలంబు మెఱసి
మధుపురంబు చేసె మధుభాషి శత్రుఘ్నుఁ
డన్న రామచంద్రుఁ డౌ ననంగ. [9-349]

పై పద్యం శతృఘ్నుడి గురించి. మధువనంలో లవణుడు అనేవాడు బయల్దేరాడు (రావణ సంహారం తర్వాత). వీడి దగ్గిరో శూలం ఉండేదిట. అది చేతిలో ఉన్నంతకాలం ఎవరూ చంపలేరు వాణ్ణి. రాముడు శతృఘ్నుడితో ఈ సంగతీ, తన అమ్ములపొదిలో ఉన్న బాణం తీసి ఇచ్చి చెప్తాడు – వాడు బయటకి వెళ్తాడు శూలం లేకుండా. వెనక్కి వచ్చేలోపు నువ్వు వాడిని వెనక్కి కోటలోకి వెళ్ళి శూలం తెచ్చుకోనీయకుండా అడ్డుకుని ఈ బాణంతో చంపాలి. రాముడు చెప్పినట్టే మధురంగా మాట్లాడే శతృఘ్నుడు మధునందనుడైన లవణుడిని చంపి మధుపురం అనేది కట్టాడు. ఈ పద్యంలో "మధు" అనే పదాన్ని పోతన ఎలా వాడాడో గమనించండి. "మధు" వనంబు, "మధు" నందనుండు, "మధు" పురంబు, "మధు" భాషి.

వ. అంతఁ గొంతకాలంబునకు రామచంద్రుని కొమారులయిన కుశ లవులిద్దఱును వాల్మీకివలన వేదాదివిద్యల యందు నేర్పరులై పెక్కు సభల సతానంబుగా రామకథాశ్లోకంబులు పాడుచు నొక్కనాఁడు రాఘవేంద్రుని యజ్ఞశాలకుం జని. [9-350]

మత్త. వట్టి మ్రాకులు పల్లవింప నవారియై మధుధార దా
నుట్టఁబాడిన వారిపాటకు నుర్వరాధిపుఁడుం బ్రజల్
బిట్టు సంతస మంది; రయ్యెడఁ బ్రీతిఁ గన్నుల బాష్పముల్
దొట్ట నొెఁదల లూఁచి వారలతోడి మక్కువ పుట్టఁగాన్. [9-351]

కొంతకాలానికి లవకుశలు వేదాది విద్యలు నేర్చి వాల్మీకి రాసిన రామకథాశ్లోకాలు పాడుతూ రాముడు చేసే యజ్ఞశాలకి చేరారు. వాళ్ళు పాడిన పాట ఎలా ఉందంటే, ఎండిపోయిన చెట్లు చిగురించేలా (వట్టి మ్రాకులు పల్లవింప), అమృత ధారలు కురిసినట్టూ (నవారియై మధుధార). ఆ పాటకి రాముడు (ఉర్వరాధిపుడు, ఉర్వ-భూమికి, వర-శ్రేష్టమైన, అధిపుడు-రాజు), అక్కడున్న ప్రజలూ సంతోషించారు. రాముడికి వారిమీద మక్కువ కలిగింది. వీళ్ళని చూసి రాముడు ఆనందపడి అడుగుతున్నాడు.

ఆ. చిన్నయన్నలార! శీతాంశుముఖులార!
నళినదళవిశాలనయనులార!
మధురభాషులార! మహిమీఁద నెవ్వరు
దల్లిదండ్రి మీకు ధన్యులార? [9-353]

చిన్న పిల్లల్లారా, మీ మొహాలు చంద్రబింబాలలాగా ఉన్నాయి. విశాలమైన కళ్ళతో మధురంగా మాట్లాడే మీరెవరు? ఈ భూమి మీద మీ తల్లీ తండ్రీ ఎవరు?

తర్వాత కథలో రాముడు వీళ్ళిద్దర్నీ తన కొడుకులుగా తెలుసుకుని చేరదీయడం, రాముడు రాజుగా ధర్మానికి కట్టుబడి ఉండి తీరాలి కనకా, అలాగే ఉంటాడు కనకా, మరో సారి తాను ఇంటికి వచ్చినా రాముడికీ తనకీ ఈ జనం వాగే మాటలు తప్పవు అని తెలుసుకున్న సీత భూమిలోకి వెళ్ళిపోవడం అనే మిగతా సూర్యవంశం కథ వచ్చే నెల వ్యాసంలో చూస్తాం.

.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS